'డార్విన్' పాఠ్యాంశాన్ని కొనసాగించాలి : జెవివి

ప్రజాశక్తి - కడప అర్బన్

డార్విన్ జీవపరిణామ సిద్ధాంతాన్ని పాఠ్యాంశాలలో యథావిధిగా కొనసాగించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ కోరారు. బుధవారం అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డార్విన్ పరిణామ సిద్ధాంతం పదవ తరగతి పాఠ్యాంశాల్లో తొలగించడం వల్ల 11, 12 తరగతుల్లో సైన్స్ స్ట్రీమ్‌ను ఎక్కువమంది విద్యార్థులు కీలకమైన విషయాన్ని తెలుసుకోలేక పోతారని చెప్పారు. పరిణామాత్మక జీవ శాస్త్రం జ్ఞానం, అవగాహన మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడంలో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి సమీర్ బాషా, రాష్ట్ర కమిటీ సభ్యులు దేవదత్తం, విద్యా విభాగం కన్వీనర్ రూత్ ఆరోగ్య మేరీ, కిరణ్ కుమార్ రాయల్ కరీముల్లా, కామేశ్వరమ్మ, వెంకట్రామ రాజు, మధుసూదన్, రామ్ పాల్గొన్నారు.

ఇంటర్ సీనియర్, జూనియర్ ఫలితాల్లో బాలికలు తమ హవా కొనసాగించారు. బుధవారం సాయంత్రం విడుదలైన ఫలితాల్లో ఉమ్మడి కడప జిల్లాలోని విద్యార్థులు తమ సత్తా చాటారు. జూనియర్ ఇంటర్ ఫలితాల్లో 46 శాతం ఉత్తీర్ణతతో 13వ స్థానం, సీనియర్ ఇంటర్ ఫలితాల్లో 60 శాతం ఉత్తీర్ణతతో 12వ స్థానంలో ఉమ్మడి కడప జిల్లా నిలిచింది.

బాలికలదే హవా!

జూనియర్ ఇంటర్‌లో 46 శాతం

సీనియర్ ఇంటర్‌లో 60 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఇంటర్ ఫలితాల్లో బాలికలు హవా కొనసాగించింది. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన ఇంటర్ పరీక్షలకు 35,886 వేల మంది హాజం యారు. జూనియర్ ఇంటర్‌లో 8,702 మంది బాలురు హాజరు కాగా 3,494 మంది పాస య్యారు. బాలికలు 10,137 మంది హాజరు కాగా 5,109 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 46 శాతం, సీనియర్ ఇంటర్‌లో 7,568 మంది బాలురలో 4093 మంది, బాలికల్లో 9,488 మందిలో 6,137 మంది పాస య్యారు. సీనియర్ ఇంటర్‌లో 17,056 మంది పరీక్షలకు హాజరు కాగా 10,230 మంది పాస్ కావడంతో 60 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లా జూనియర్ ఇంటర్ ఫలితాల్లో 13వ స్థానం, సీనియర్ ఇంటర్‌లో 12వ స్థానంలో నిలిచింది. ఐదేళ్ల ఇంటర్ ఫలితాలను పరిశీలిస్తే 2019లో ఇంటర్ మొదటి సంవత్సరంలో బాలురు 9,927 మంది హాజరు కాగా 4,261 మంది పాసయ్యారు. 43 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 10,941 మంది హాజరు కాగా 6,0 21 మంది పాసయ్యారు. 55 శాతం ఉత్తీర్ణత సాధించడం గమ నార్హం. మొత్తం మీద ఇంటర్ బాల బాలికలు 20,868 మంది పరీక్షలకు హాజరు కాగా 10,282 మంది పాస్ కావడం తెలిసిందే. 53 శాతం ఉత్తీర్ణత సాధించడం గమనార్హం. 2019లో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో బాలురు 9,020 మంది హాజరు కాగా 4,963 మంది పాసయ్యారు. 55 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 9,863 మంది హాజరు కాగా 6,562 మంది పాసయ్యారు. 67 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం మీద ఇంటర్ బాలబాలికలు 18,853 మంది పరీక్షలకు హాజరు కాగా 11,525 మంది ఉత్తీర్ణత సాధిం చారు. 61 శాతం ఉత్తీర్ణత సాధించడం గమ నార్హం. 2020లో ఇంటర్ మొదటి సంవత్సరంలో బాలురు 10,173 మంది హాజరు కాగా 3,982 మంది పాస్ కావడం గమనార్హం. 39 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 11,892 మంది హాజరు కాగా 6,457 మంది పాసయ్యారు. 54 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం మీద ఇంటర్ బాలబాలికలు 22,070 మంది పరీక్షలకు హాజరు కాగా 10,430 మంది ఉత్తీర్ణత సాధించారు. 47 శాతం ఉత్తీర్ణత సాధించడం గమనార్హం. 2020 ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో బాలురు 8,869 మంది హాజరు కాగా 4,189 మంది పాస్ కావడం గమనార్హం. 47 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 10,015 మంది హాజరు కాగా 5,844 మంది పాసయ్యారు. 58 శాతం ఉత్తీర్ణత సాధిం చారు. మొత్తం మీద ఇంటర్ బాలబాలికలు 18, 884 మంది పరీక్షలకు హాజరు కాగా 10,033 మంది ఉత్తీర్ణత సాధించారు. 53 శాతం ఉత్తీర్ణత సాధించడం గమనార్హం. 2021 అకడమిక్ ఇయర్‌లో మొదటి సంవత్సరంలో కరోనా విజృంభణ కారణంగా 26,100 మంది, ద్వితీయ సంవత్సరంలో 23,461 మంది బాలబాలికలు పరీక్షలకు హాజరు కాగా 100 శాతం ఉత్తీర్ణత సాధించడం గమనార్హం. అనంతరం 2021లో ఇంటర్ మొదటి సంవత్సరంలో బాలురు 10,006 మంది హాజరు కాగా 3,367 మంది పాస్ కావడం గమనార్హం. ఈలెక్కన 34 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 11,102 మంది హాజరు కాగా 5,241 మంది పాసయ్యారు. 47 శాతం ఉత్తీర్ణత సాధిం చారు. మొత్తం మీద ఇంటర్ బాలబాలికలు 21,108 మంది పరీక్షలకు హాజరు కాగా 8,608 మంది ఉత్తీర్ణత సాధించారు. 41 శాతం ఉత్తీర్ణత సాధించడం గమనార్హం. 2021లో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో బాలురు 10,624 మంది హాజరు కాగా 4,402 మంది పాస్ కావడం గమ నార్హం. 41 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 10,844 మంది హాజరు కాగా 6,2 28 మంది పాసయ్యారు. 57 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం మీద ఇంటర్ బాలబాలికలు 21,468 మంది పరీక్షలకు హాజరు కాగా 10,630 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. 50 శాతం ఉత్తీర్ణత సాధించడం గమనార్హం. ఏదేమైనా ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా చివరి వరుసలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది.

తిరుగుబాటు తప్పదు : ఫ్యాప్టో

ప్రజాశక్తి - బద్వేలు

పాఠశాలల సందర్శన పేరుతో ఉపాధ్యాయులను వేధించడమే పనిగా పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) కడప జిల్లా చైర్మన్ మాదన విజయకుమార్ హెచ్చరించారు. ఉపాధ్యాయుల పట్ల అధికారుల పట్ల పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రెండో రోజు స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద నల్లరిబ్బన్లు ధరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలలను సందర్శిస్తే గ్రౌండ్ లెవెల్ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశించామని తెలిపారు. సందర్శనల సందర్భంగా చిన్న చిన్న కారణాలు చూపి ఉపాధ్యాయులను అవమానించడం, వేధించడం, షోకాజ్ నోటీసులు జారీ చేయడం, సస్పెన్డ్ చేయడం నిత్య కృత్యంగా మారిందన్నారు. ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.వెంకటసుబ్బారెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.ఓబుల్ రెడ్డి, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సునీల్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎస్.శశిధర్ కుమార్, ఎన్.వెంకట సుబ్బయ్య, సి.నర్సింహులు, టి.శివ ప్రసాద్, బి.పెం చలయ్య, గౌస్ బాషా, జి.శివశంకర్ రెడ్డి, రామచంద్రయ్య, యస్.చెన్నయ్య, జి.గోవిందు, ఎ.గుర్రయ్య, మురళి, చంద్రశేఖర్ యాదవ్, చక్రపాణి, శ్రీని వాసులు, సుబ్బారావు, శేషాద్రి, ఎ.వి.రమణయ్య, యస్.లూక్, సుబ్బరాయుడు, దేవానందం, రమణ రావు, తిరుపతి రెడ్డి, అంకయ్య, జకరయ్య, లాజరయ్య పాల్గొన్నారు. **కడప అర్బన్ :** పాఠశాలల సందర్శన పేరుతో ఉపాధ్యాయులను వేధించడమే పనిగా పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) కడప జిల్లా సెక్రటరీ జనరల్ మహమ్మద్ ఇర్షాద్ హెచ్చరించారు. బుధవారం ఉపాధ్యాయుల పట్ల, అధికారుల పట్ల పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రెండవ రోజు నిరసన కార్యక్రమంలో భాగంగా సాయంత్రం కలెక్టరేట్ కార్యాలయం వద్ద నల్ల రిబ్బన్లు ధరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, ఎస్‌టియు రాష్ట్ర నాయకులు ఇలియాస్ బాషా మాట్లాడుతూ ప్రవీణ్ ప్రకాష్ వైఖరి చూస్తుంటే ఉపా ధ్యాయులను లక్ష్యంగా చేసుకుని విద్యా వ్యవస్థని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఉందని పేర్కొన్నారు. పాఠశాలల పనివేళల అనంతరం విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పరిశీలనలు చేయడం, ప్రభుత్వ ఉపాధ్యాయుల కంటే ప్రయివేట్ ఉపాధ్యాయులే బాగా పనిచేస్తున్నారని ప్రజల ముందు పేర్కొనడాన్ని బట్టి చూస్తే ఒక పథకం ప్రకారం ప్రయివేట్ కార్పొరేటు విద్యను ప్రోత్సహిస్తున్నట్లు ఉందని వాపోయారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, ఎపిటిఎఫ్1938 జిల్లా అధ్యక్షుడు అబ్దుల్లా, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కడప : కలెక్టరేట్ ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న నాయకులు

సేవా భావంతో పనిచేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారిత శాఖలు సమన్వయంతో, సేవాభావంతో పని చేయాలని కలెక్టర్ విజయ్‌రామరాజు పేర్కొన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారిత శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో గర్భిణులు, బాలింతకలు, బాలలకు అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలపై సంబం ధితాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, పట్టణాల్లోని అన్ని అంగన్వాడీ కేంద్రాలను ఆయా పరిధిలోని సచివాలయాలతో మ్యాపింగ్ చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతున్న వారు అంగన్వాడీ సేవలను పొందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలలో కేవలం బాలిం తలకు, గర్భిణులకు, బాలబాలికలకు మాత్రమే కాకుండా మహిళలకు, వృద్ధులకు కూడా సేవలు సేవలు అందివ్వాలని సూచించారు. వారికి సరైన పౌష్టికాహారం, ప్రణాళిక ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహిస్తూ మహిళలు, బాలికలకు రక్త హీనత సమస్యలు రాకుండా ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఫలా లను వారికే అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయకపోతే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు, ఐసిడిఎస్ పిడి రాణి, సిడిపిఒలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రిజిస్టార్ కార్యాలయంలో అవినీతిపై ఆరా తీస్తున్న అధికారులు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి దాడులు

బద్వేలు : బద్వేల్ పట్టణం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి రూ. 5 లక్షలు స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అవినీతి నిరోధక శాఖ డిఎస్‌పి కన్‌జాంక్షన్ ఆధ్వర్యంలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతికి సంబంధించిన ఫిర్యాదులు అధికంగా రావడంతో కచ్చితమైన సమా చారంతో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. నగదు , అనధికార సిబ్బంది ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నామని దీనిపై సమగ్రంగా విచారించి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని వెల్లడించారు. గతంలో నాలుగు మార్లు, ప్రస్తుతం ఐదోసారి బద్వేల్ ఎసిబి దాడులు నిర్వహించామని చెప్పారు. బద్వేల్‌లో ప్రభుత్వ స్థలం 70 శాతం, రిజిస్ట్రార్ ల్యాండ్ తక్కువగా ఉండటంతో సెంటు రూ. 20 లక్షల పైగా పలుకుతున్నడంతో రిజిస్టర్ స్థలానికి అధిక డిమాండ్ ఉందని చప్పారు. గతంలో అక్రమ రిజిస్టర్లు జరిగాయని అనేక ఆరోపణలు రావడంతో కార్యాలయంలో క్షుణ్ణంగా సోదాలు చేపట్టామని తెలిపారు. తనిఖీలలో సిఐలు యల్లం రాజు, ఆలి అహ్మద్, కృష్ణమోహన్, ఎస్ఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రక్త నిల్వలు పెంచుదాం

కడప అర్బన్ : రిమ్స్ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేసి రక్తనిల్వలు పెంచాలని ప్రముఖ వ్యాపారవేత్త రిలయన్స్ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని చెన్నూరు బస్టాండ్ సమీపంలో బ్లడ్2లివ్ వ్యవస్థాపకులు పట్టుపోగుల పవన్ కుమార్ ఆధ్వర్యంలో చేస్తున్న బ్లడ్2లివ్ రక్తదాన వారోత్సవాలల్లో భాగంగా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా మాధవ్ రెడ్డి విచ్చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనం తరం ఆయన స్వయంగా రక్తదానం చేసి అందరికి ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో రిమ్స్ బ్లడ్ బ్యాంకు డాక్టర్ ప్రవీణ్,సిస్టర్ రెస్చల్,టెక్నిషన్స్ జయచంద్రా రెడ్డి,సంతోషి,పుల్లయ్య,హరి,ఈశ్వర్ పాల్గొన్నారు.

రిమ్స్‌లో ఫ్యాన్లకు మరమ్మతులు చేపట్టాలి

కడప అర్బన్ : రిమ్స్ ఆస్పత్రిలో ఉన్న అరకొర ఫ్యాన్లు పనిచేయడం లేదని, దీంతో బాలింతలు, చిన్నారులు ఉక్కపోతకు గురవుతున్నారని, వెంటనే మరమ్మతు చేపట్టాలని పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం. అంకన్న అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఫ్యాన్లు పనిచేయకపోవడంతో 15 మందికిపైగా బాలింతలు, చిన్నారులను ఇతర వార్డులకు తరలించారని చెప్పారు. మంగళవారం రాత్రంతా ఉక్కుపోతతకు గురవడంతో రోగులు ఇబ్బందులు పడ్డారన్నారు. వెంటనే రిమ్స్ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రోత్ మానిటరింగ్ కిట్స్ పంపిణీ

వల్లూరు : అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులు, గర్భిణీల, బాలింతలకు సంబంధించి మానిటరింగ్ కిట్స్‌ను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తెలం గాణ, ఆంధ్ర ప్రదేశ్ సిఎస్ఆర్ ఇండియన్ ఆయిల్ ఆరోగ్యం నిధుల ద్వారా అధికారులు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ పీడీ రాణి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఐసిడిఎస్ పీడీ మాట్లాడుతూ చిన్నారులు, బాలింతలు గర్భిణీల అభివృద్ధి కి తోడ్పాటుగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ సిఎస్ఆర్ ఇండియన్ ఆయిల్ ఆరోగ్యం నిధుల కేటాయింపు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు ఇన్‌ఛార్జి తహశీల్దార్ అమరేశ్వరి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రఘునాథ్, ఎంఇఒ లిల్లెమ్మ, ఇఒపిఆర్‌డి ప్రసాద్, సిడిపిఒ రమాదేవి, సిహెచ్ఒ వేణుగోపాల్ , ఐసిడిసి సూపర్‌వైజరన్ మేరీ విజయ కుమారి, శ్రీదేవి, అంగన్వాడీ వర్కర్స్ , మహిళలు చిన్నారులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే ఆర్థిక ప్రగతి సాధ్యం : జెసి

కడప : ఉన్నత విద్యతోనే కుటుంబ ఆర్థిక ప్రగతితో పాటు, సమాజం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని జెసి జి.గణేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం అనం తపురం జిల్లా నార్పల బహిరంగ సభ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించి 'జగనన్న వసతి దీవెన' మొదటి విడత లబ్ది మొత్తాన్ని కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా అర్హులయిన విద్యా ర్థుల తల్లుల ఖాతాలో జమ చేశారు. కార్యక్రమానికి స్థానిక విసి హాలు నుంచి జెసితోపాటు రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జల వెంకట లక్ష్మీ, రాష్ట్ర సగర ఉప్పర కార్పొరేషన్ చైర్ పర్సన్ జి. రమణమ్మ, ఎపిఈఐడి డైరెక్టర్ బి. నాగ మల్లిక, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జయ ప్రకాష్, ఎస్సి, ఎస్టీ కార్పొరేషన్ల ఈడి హెచ్. వెంకట సుబ్బయ్య, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వి. బ్రహ్మయ్య హాజ రయ్యారు. ముఖ్యమంత్రి విసి ముగిసిన అనంతరం 2022-23 విద్యా సం వత్సరం మొదటి విడతకు గాను జిల్లాలోని 76,714 మంది విద్యార్థులకు మంజూరయిన 'జగనన్న వసతి దీవెన' లబ్ది మొత్తం రూ. 44,80,47,500 మెగా చెక్కును విద్యార్థులు, వారి తల్లులకు అందించారు. కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంక్షేమ శాఖ, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలి

పోరుమామిళ్ల టౌన్ : అంగన్వాడీ కార్యకర్తలకు, ఆయాలకు గ్రాట్యుటీ అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. బైరవ ప్రసాద్ డిమాండ్ చేశారు. మండలంలోని పోరుమామిళ్ల, టేకూరుపేట, రంగసముద్రం, కవలకుంట్ల అంగన్వాడీ వర్కర్స్ , మినీ అంగన్వాడీ అండ్ హెల్పర్స్ సెక్టార్ సమావేశాన్ని బుధవారం వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మేడేను పండుగగా అంగన్వాడి వర్కర్స్, అండ్ హెల్పర్స్, మినీ అంగన్వాడీ టీచర్లు నిర్వహిం చుకోవాలని పేర్కొన్నారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్, మినీ అంగన్వాడీ వర్కర్స్ పెద్ద ఎత్తున మేడే జండా వందనం చేసి, అంబేద్కర్ విగ్రహం ఎదురుగా బహిరంగ సభలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనేక సేవలందిస్తున్న స్కీమ్ వర్కర్లందరికీ కనీస వేతనం నెలకు రూ.26 వేలు, పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయం కల్పించాలన్నారు. మరణించిన వారికి రూ. 50 లక్షల బీమా పథకం అమలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పోరుమామిళ్ల ప్రాజెక్టు సెక్టార్ లీడర్లు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు విజయమ్మ, పోరుమామిళ్ల సెక్టార్ లీడర్, నగిరి రేణుకాదేవి, రంగసముద్రం సెక్టార్ లీడర్ జ్యోతిమ్మ, టేకురుపేట సెక్టార్ లీడర్ వాణి, ఫాతిమా, లావణ్య, సుధా, రమాదేవి అంగన్వాడీవర్కర్స్ హెల్పర్స్ పాల్గొన్నారు.

బస్సుల ఉపసంహరణ మానుకోవాలి

కడప అర్బన్ : కేంద్రీయ విద్యా లయాలకు రాబోయే విద్యా సంవత్సరం నుంచి బస్సులు నిలిపివేస్తామనే ఆర్టీసీ నిర్ణ యాన్ని ఉపసంహరిం చుకో వాలని తల్లి దండ్రులు కోరా రు. బుధవారం డిప్యూటీ ట్రా న్స్‌పోర్టు కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెవి పేరెంట్స్ అసోసియేషన్ నాయ కులు జితేంద్ర మాట్లాడుతూ 2014 నుంచి కెవికి ఆర్‌టిసి బస్సులు నడు పుతోందని, ప్రతి ఏడాదీ వెయ్యి పాస్‌లు తీసుకుంటున్నారని తెలిపారు. నిలిపివేస్తే పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు రవాణా కోసం పెద్ద మొత్తంలో వ్యయం చేయలేక తమపిల్లలను చదువు మాన్పించే పరిస్థితి ఉంటుందన్నారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మాట్లాడుతూ బస్సులు కొనసాగించాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్, ట్రాన్స్‌పోర్టు కమిషనర్ల లేఖలు రాస్తానని తెలిపారు.

డిటిసికి వినతిపత్రం అందజేస్తున్న తల్లిదండ్రులు

వేసవిలో కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి

వల్లూరు : ప్రస్తుత వేసవిలో ఉపాధి కూలీలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులురాజు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబవరం, దిగువపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ చట్టం కింద చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి కూలీలను ఉద్దేశించి మాట్లాడుతూ పనులు కల్పించే విధానం, కొలతలు, ఎన్ని రోజులకు ఎంత వేతనం పడుతోంది, ఎన్ని రోజులకు వేతనం అందుతోందని వంటి విషయాలపై కూలీలతో చర్చించారు. ప్రస్తుతం వేసవి కాలమైనందున ఉదయమే త్వరగా పని ముగించుకోవాలన్నారు. ఎండవేడమికి లోనుకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ ఎపిఒ పార్థసారథి, టిఎబిఎఫ్‌టి, ఎఫ్ఎలు పాల్గొన్నారు

ఎంఆర్‌పిఎస్ జిల్లా ఇన్‌ఛార్జిగా ఆర్.ఎన్.రాజా

కడప అర్బన్ : ఎంఆర్‌పిఎస్ జిల్లా ఇన్‌ఛార్జిగా ఆర్.ఎన్. రాజాను నియమిస్తూ వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో మాదిగల అభివృద్ధికి పాటుపడుతానని చెప్పారు. అవకాశాన్ని కల్పించిన వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మయ్యకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. వర్గీకరణ లక్ష్యంగా పోరాడుతానని పేర్కొన్నారు.

ఒక్క సెల్ఫీకే రాద్ధాంతమా?

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరా భివృద్ధిలో భాగంగా తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాస రెడ్డి ఒక్క సెల్ఫీ పెడితేనే వైసిపి నేతలు గిలగిల కొట్టుకుంటున్నారని టిడిపి క్రిష్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.పీ. సురేష్ ఎద్దేవా చేశారు. బుధవారం టిడిపి జిల్లా కార్యాలయంలో పార్లమెంట్ మీడియా కో-ఆర్డినేటర్ జనార్దన్, టిడిపి నేతలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిలో భాగంగా శ్రీనివాస రెడ్డి పాత బస్టాండ్ వద్ద ఉన్న బ్రిడ్జి పూర్తి చేశామని సెల్ఫీ పెడితే వైసిపి నేతలు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లారని విమర్శించారు. డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, వైసిపి నేతలు వారి హయాంలో అభివృద్ధి చేశామని చెప్పుకునే ధైర్యం లేక కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి చేసిన పనుల గురించి చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. నాలుగు సంవత్సరాల వైసిపి పాలనలో నగరంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పుకోలేక కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి ని చూపిస్తున్నారని విమర్శించారు.

టి-20 విజేతగా అనంతపురం జట్టు

ప్రజాశక్తి - కడప

విజయం సాధించిన అనంతపురం జట్టు

ఈనెల 21 నుంచి 26 వరకు కడపలోని వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్ జోన్ సీనియర్స్ టి -20 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్లో వరుసగా నాలుగు మ్యాచ్‌లు విజయం సాధించి అనంతపురం జట్టు టోర్నమెంట్ విజేతగా నిలిచింది. నాలుగు మ్యాచ్‌లలో మూడు మ్యాచ్‌లు విజయం సాధించిన కడప జట్టు రన్నర్స్ గా నిలిచింది. బుధవారం ఉదయం వై.ఎస్. రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో నాలుగు వికెట్ల తేడాతో కర్నూలు జట్టు చిత్తూరు జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగుకు దిగిన చిత్తూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. ఆజట్టులోని ఇ. ధరణి కుమార్ నాయుడు 65 (నాట్ అవుట్) పరుగులు చేశాడు. కర్నూలు జట్టుకు చెందిన ఎం. ఆంజనేయులు 2 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 171 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగుకు దిగిన కర్నూలు జట్టు 18.1 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసి 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది చివరి లీగ్ మ్యాచ్ లో భాగంగా మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో కడప జట్టుపై ఒక వికెట్ తేడాతో అనంతపురం జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచిన అనంతపురం జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన కడప జట్టు 18.1 ఓవర్లలో 155 పరుగులకు ఆల్ అవుట్ అయింది. అనంతరం 156 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగుకు దిగిన అనంతపురం జట్టు 18.4 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసి ఒక వికెట్ తేడాతో ఘనవిజయం సాధించింది. ఆ జట్టులోని ఎం. రాజు కొల్లాయప్ప 42 పరుగులు చేశాడు. కడప జట్టులోని ఎం. హరి శంకర్ రెడ్డి షేక్ మొహమ్మద్ రఫీ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు.

దాదాస్ రవికుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్

రవికుమార్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

నగరానికి చెందిన దాదా సంస్థ పీ.ఎం. రవికుమార్ బాబుకు కేంద్ర ప్రభుత్వం అంబేద్కర్ రత్న అవార్డును ప్రదానం చేసిన సందర్భంగా వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో అన్ని రాజకీయ సంఘాలు, కుల సంఘాలతో ఆమూరు బాలదాసు అధ్యక్షతన ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ నాయకులు నర్రిరెడ్డి తులసి రెడ్డి, నజీర్ అహమ్మద్, చీకటి చార్లెస్, తెలుగు దేశం నాయకులు అమీరబాబు, వెంకటసుబ్బారెడ్డి, జి. లక్ష్మీరెడ్డి, మురికినాటి సునీత, కొండా సుబ్బయ్య, వెంకటేష్ యాదవ్ రాఘవ, జనార్దన్ రెడ్డి, బి జె పి బాలకృష్ణ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవి కుమార్ బాబు సేవా కార్యక్రమాలలో అల్ప సంఖ్య వర్గాలకు ఎన లేని కృషి చేసాడని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకుల అమీర్ బాబు, కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్ అహ్మద్, దళిత నాయకులు రమణ, బిసి నాయకులు అవ్వారు మల్లికార్జు, దళిత నాయకులు హేతువాద సంఘం సి ఆర్ వి ప్రసాద్ రావు పాస్టర్ల అసోసియేషన్ సంఘ అధ్యక్షులు మల్లెం విజయభాస్కర్, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర నగర కార్యదర్శి శివ, భాగ్యమ్మ , టిడిపి లోకజన శక్తి పార్టీ పెద్దవీటి నాగమణి కలిసి రవి బాబుకు ఘనంగా సన్మానం చేశారు.

సంక్షేమ పథకాలు వైసిపికే సాధ్యం

వల్లూరు : ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలంటే ఒక్క వైసిపి ప్రభుత్వం వల్ల సాధ్యం అవుతుందని వైసిపి మండల కన్వీనర్ వీరారెడ్డి, వైసిపి రాష్ట్ర యూత్ జనరల్ సెక్రటరీ ఇంది రెడ్డి శంకర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పైడి కాలువలో జగనన్న మన భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్ఆర్ పోస్టర్లను అతికించి ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ పథకాల అందు తున్నాయా లేదా అని తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్ రెడ్డి, రామ సుబ్బారెడ్డి , పుల్లయ్య పాల్గొన్నారు.

పలువురు డిఎస్‌పిలు బదిలీ

ప్రజాశక్తి -కడప అర్బన్

జిల్లాలో పలువురు డిఎస్‌పిలను ప్రభుత్వం బదిలీలు చేసింది. దిశ డిఎస్‌పి వాసుదేవన్ పుట్టపర్తికి బదిలీ అయ్యారు. కడప డిఎస్‌పి బి.వి.శివారెడ్డి అనంతపురం రూరల్ డిఎస్‌పిగా, జమ్మలమడుగు డిఎస్‌పి నాగరాజు ఎసిబి డిఎస్‌పిగా, కడప ఎసిబి డిఎస్‌పి కంజక్షన్ హిందూపురానికి, తిరుపతి డిటిసి డిఎస్‌పి ఎమ్‌డి షరీఫ్ కడప డిఎస్‌గా బదిలీ అయ్యారు. ఆదోని డిఎస్‌పి వినోద్ కుమార్ పులివెందులకు, తాడిపత్రి డిఎస్‌పి చైతన్యకుమార్ రాజంపేట డిఎస్‌పిగా, సత్యసాయి జిల్లా ఎస్‌బి డిఎస్‌పి ఉమామహేశ్వరరెడ్డి జమ్మలమడుగుకు బదిలీ అయ్యారు.

శ్రీనివాస రామానుజన్‌కు ఘన నివాళి

కడప అర్బన్ : శ్రీనివాస రామానుజన్ ప్రపంచం గర్వించ దగ్గ మేధావి అని, డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.అంజనేయ ప్రసాద్ అన్నారు. శ్రీనివాస రామానుజన్ 103 వ వర్ధంతి సందర్భంగా డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.అంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ 15 ఏళ్ళ వయస్సులోనే పెద్ద ప్రొఫెసర్లకే సాధ్యంకాని ఆల్జీబ్రా, అనలైటికల్ జామెట్రి సిద్ధా ంతాలను ఎలాంటి పుస్తకాలు లేకుండా కనుగొన్నారని గుర్తు చేశారు. 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధా వులలో శ్రీనివాస రామానుజన్ ఒకరని కొనియాడారు. కార్య క్రమంలో రిజిస్ట్రార్, ప్రొఫెసర్ సురేంద్రనాథ్ రెడ్డి, డిప్యూటీ రిజి స్ట్రార్ రాజేష్ కుమార్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి

కడప : ప్రతి ఒక్కరూ తమ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని యోగివేమన యూనివర్సిటీ ఎంఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ నరాలరు రమణారెడ్డి, ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ఎ. నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం ప్రభుత్వ పురుషుల కళాశాల స్వయం ప్రతిపత్తి కడప ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపును యోగి వేమన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ నరాల రమణా రెడ్డి సందర్శించారు. వాలంటీర్లతో కలిసి మొక్కలు నాటారు. చెట్లు కాలుష్యం నివారించి ప్రాణవాయువును అందించడంలో సహాయపడతాయని చెప్పారు.

అండర్-23 జిల్లా క్రికెట్ జట్టు కెప్టెన్‌గా వంశీకృష్ణ

కడప : అండర్- 23 కడప జిల్లా క్రికెట్ జట్టు కెప్టెన్‌గా టి. వంశీకృష్ణ వ్యవహరించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ. రెడ్డి ప్రసాద్ తెలిపారు. ఈనెల 28 నుంచి కడపలోని వైయస్ రాజారెడ్డి ఏసిఎస్ స్టేడియం, కెఎస్ఆర్ఎం, కెఓఆర్ఎం క్రికెట్ మైదానాలలో ప్రారంభం కానున్న ఏసీఏ సౌత్ జోన్ అండర్ 23 మెన్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొనే కడప జిల్లా క్రికెట్ జట్టును బుధవారం ప్రకటించారు. కడప జిల్లా జట్టు కెప్టెన్ గా టి. వంశీకృష్ణ, వైస్ కెప్టెన్‌గా ఎస్. ఆదిల్ హుస్సేన్ సభ్యులుగా ఏ. యువరాజ్, ఏ. శివకేశవ రాయల్, ఎం. వాసుదేవరాజు, పి. జాఫర్ అలీ ఖాన్, ఎస్. జహీర్ అబ్బాస్, ఎం. శ్రీనివాసులరెడ్డి, ఎం విజయ భావేంద్ర, షేక్ అస్లాం, ఎం. చెన్నారెడ్డి, షేక్ ఆసిఫ్ హుస్సేన్, వి. ధనుష్‌రెడ్డి, ఎం. మదన్ కుమార్, ఎల్. కళ్యాణ్ కృష్ణ, కె వెంకట సతీష్ వ్యవహరిస్తారని తెలిపారు.



రాజ్యాంగంపై అవాహన కల్పిస్తున్న అధ్యాపకులు, ప్రిన్సిపల్

భారత రాజ్యాంగంపై అవగాహన

పోరుమామిళ్ల టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. నరేష్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కృష్ణ శారద కళాశాల లెక్చరర్ పి.న రసింహులు గెస్ట్ ఫ్యాకల్టీగా పాల్గొని భారత రాజ్యాంగం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. భారత రాజ్యాంగం సమైక్యత, సమానత్వం,లౌకిక తత్వం, సామరస్యాన్ని భారత ప్రజలందరి మధ్య పెంపొందించడం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అధ్యక్షతన రచించి, ఏర్పాటు చేసిన గొప్ప గ్రంథమే రాజ్యాంగమని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర బోధకులు డి.సి.పీరయ్య, ఫిజికల్ డైరెక్టర్ నరసింహారెడ్డి, కామర్స్ అధ్యాపకులు వెంబడి ఈశ్వరయ్య, అధ్యాపకులు రవి, చైతన్య పాల్గొన్నారు.

రాములోరి గుడి ప్రతిష్టాపన

పోరుమామిళ్లటౌన్ : మండలంలోని యల్లువపల్లెలో బుధవారం రాములవారి నూతన గుడి ప్రతిష్ట కన్నుల పండువగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బద్వేల్ తెలుగు యువత నాయకులు చెరుకూరి రవి హాజరై రాముల వారి కి పట్టువస్త్రాలు సమర్పించారు. కుటుంబంతోసహా పూజలు నిర్వహించి, ఆలయ అభివృద్ధికి రూ.1.20 లక్షలు చందా ఇచ్చారు. కార్యక్రమానికి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చెరుకూరి చెన్నా రాయుడు, కలవకూరి నడిపి వెంకటసుబ్బయ్య భైరవ ప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

ఐసిడిఎస్ ఉద్యోగి ఈశ్వరయ్యను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కమలాపురం ఐటిడిఎస్ ప్రాజెక్ట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఈశ్వరయ్యను సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈశ్వరయ్య అంగన్వాడీలను వేధిస్తూ, లంచాలకు తెగబడుతున్నారని ఆరోపించారు. ప్రతి అంగన్వాడీ టీచర్‌ను మభ్యపెడుతూ, భయాందోళను గురి చేస్తున్నారన్నారు. సీనియర్ అసిస్టెంట్‌గా కమలాపురంలో విధులు నిర్వహించకుండా నిరంతరం పీడీ కార్యాలయంలో ఉంటూ అక్కడ దందాలు నడుపుతున్నారని విమర్శించారు. కమలాపురంలో విధులు నిర్వహించాల్సిన ఈశ్వరయ్యకు నిరంతరం కడపలో ఏమి పనో కలెక్టర్ విచారణకు ఆదేశించాలని కోరారు. ఐసిడిఎస్ పీడీ ఈశ్వరయ్య చర్యలను వెనకేసుకురావడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, సిఐటియు నాయకులు శేఖర్, రమణ, పక్కీరయ్య పాల్గొన్నారు.

సబ్సిడీ డ్రోన్‌లను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

వ్యవసాయంలో పెరుగుతున్న ఆధునీకరణలో భాగంగా వచ్చిన డ్రోన్‌లను రైతులకు సబ్సిడీతో ప్రభుత్వం పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. మండలంలోని పల్లవోలు ఆర్‌బికెలో విఎఎలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రోన్‌ల ద్వారా క్రిమిసంహారక మందులు పొలాలకు పిచికారి సులభంగా చేసుకోవచ్చని తెలిపారు. రూ.10 లక్షల విలువ చేసే డ్రోన్‌లను రైతు సిహెచ్‌సి గ్రూపులకు 40శాతం సబ్సిడీతో మంజూరు చేస్తుందన్నారు. ఎజిబిఎస్, డిప్లొమా పూర్తి చేసిన వారికి 50శాతం సబ్సిడీతో మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో విఎఎలు, ఎంపిఇఒలు పాల్గొన్నారు.

వినికిడి యంత్రం అందజేత

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పట్టణంలోని ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కడప పట్టణానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వృద్ధుడికి వినికిడి యంత్రాన్ని ప్రదానం చేశారు. వెంకటేశ్వర్లు వినికిడి లోపంతో బాధపడుతున్నాడని, ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఏమైనా సహాయం చేయమని ఆర్ఎంపి రంగయ్య కోరారు. ఇందుకు స్పందించిన ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ స్థానిక వివేకానంద క్లాత్ మార్కెట్‌లోని లలిత క్లాత్ మార్కెట్ యజమాని కడప రవికి విషయం వివరించడంతో ఆయన రూ.12వేలు సహాయం చేశారు. ఈ సందర్భంగా సహాయం చేసిన కడప రవికి ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ తరపున ధన్యవాదాలు తెలిపారు.

వినికిడి యంత్రాన్ని అందిస్తున్న సత్యనారాయణ

ప్రశంసాపత్రం అందుకుంటున్న ప్రతాప్

గొడ్లవీడుకు ఉత్తమ పంచాయతీ పురస్కారం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని గొడ్లవీడు గ్రామ పంచాయతీకి 2023 ఏడాదికిగానూ మండలస్థాయి ఉత్తమ పంచాయతీగా పురస్కారం లభించింది. ఆ మేరకు గ్రామపంచాయతీ సెక్రటరీ ఎస్.ప్రతాప్‌కు బుధవారం ఎంపిడిఒ వెంగమునిరెడ్డి ప్రశంసాపత్రాన్ని అందించారు. పేదరికం లేని, మెరుగైన జీవనోపాదుల గ్రామ పంచాయతీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రతాప్‌కు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌ను గ్రామస్తులు, అధికారులు ఘనంగా సన్మానించారు. పంచాయతీ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తానని ప్రతాప్ తెలిపారు.

బద్రిపల్లి వద్ద నూగులను జల్లి పడుతున్న రైతులు

నూగు నూర్పిళ్లు ప్రారంభం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో రబీలో వేసవి పంటగా సాగు చేసిన నూగు పంట నూర్పిడి పనులు ప్రారంభమయ్యాయి. జనవరి చివరి నుంచి ఫిబ్రవరి వరకు రైతులు ఈ పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట నూర్పిడి దశలో ఉంది. సిద్ధారెడ్డిపల్లి, సోమాపురం, విశ్వనాధపురం, బద్రిపల్లి, చియ్యపాడు, సీతారామపురం, అల్లాడుపల్లె, వెంగన్నగారిపల్లె, చెండ్లూరు, రేపల్లె గ్రామాల పరిధిలో 500 ఎకరాల్లో రైతులు పంటను సాగు చేశారు. ఈ ఏడాది గతంలో కంటే సాగు కాస్త తగ్గినట్లు తెలుస్తోంది. వేసవిలో కెసి కెనాల్‌కు నీటిని విడుదల చేస్తామని ప్రకటించడంతో వరి, మినుము వేరుశనగ వంటి పంటలు సాగు చేశారు. మే మెదటి వారానికి ఎక్కువ భాగం నూర్పిడి కూడా పూర్తి అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. నూగు పంట సాగుకు ఎకరాకు రూ.పదివేల లోపు మాత్రమే ఖర్చయిందని, నాలుగు నుంచి ఐదు బస్తాల వరకు దిగుబడి వస్తుందని రైతులు సూచిస్తున్నారు. ధరలు బస్తా రూ.12వేల వరకు పలికుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. నూగు సాగుతో వేసవి ఖర్చులు వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

యువగళంలో డాక్టర్ కృష్ణకిశోర్‌రెడ్డి

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

మాజీ మంత్రి, టిడిపి నాయకులు నారా లోకేష్ యువగళం పాద యాత్రలో కడపకు చెందిన బాలాజీ హాస్పిటల్ అధినేత ప్రముఖ డాక్టర్ కృష్ణ కిషోర్ రెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు, డాక్టర్ కిషోర్ కడప అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్న విషయం తెలిసిందే. బుధవారం కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గంలోని కోస్గి దగ్గర దాదాపు పది వాహనాలలో తన అనుచరులతో వెళ్లి సంఘీభావం తెలిపారు. పలు అంశాలపై ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. దాదాపు 20 నిమిషాలపైన ఇద్దరు ప్రస్తుత రాజ కీయాల పైనా, కడప టికెట్ మీద నారా లోకేష్‌తో ఏకాంతంగా చర్చించినట్లు సమాచారం. లోకేష్ కడపలో ఎవరికైతే ప్రజా ఆదరణ ఉన్నవారికి పార్టీలో చర్చించి టికెట్ కేటాయిస్తామని ఆయన తెలిపినట్లు తెలుస్తోంది. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డి.వి సుబ్బారెడ్డి, ఆర్ఎస్ బ్రదర్స్ అధినేత వీర కుమార్ రెడ్డి, ఎస్‌సి సెల్ నాయకులు ఎదురురి బాబు, సుబ్బ నరసయ్య పాల్గొన్నారు.

నారా లోకేష్‌తో కృష్ణకిశోర్‌రెడ్డి

అమృతనగర్‌లో పారిశుధ్యం అధ్వానం

- దోమలు, విషపురుగులతో ప్రజలు సహవాసం.. విన్నవించినా స్పందించని అధికారులు

ఆవాసాల మధ్య దుర్గంధం, ఇళ్ల ముంగిట పారుతున్న మురుగు నీరు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని అమృతనగర్‌లో పారిశుధ్యం పడకేసింది. కాలువలు లేకపోవడం వల్ల మురికినీరు అంతా ఆవాసాల మధ్యనే పేరుకుపోతోంది. మంచినీటి సౌకర్యం కూడా లేదు. ప్రతి ఇంటికి కుళాయి ఉంది కానీ మెయిన్ పైప్‌లైన్ నుండి కనెక్షన్ ఇవ్వకపోవడం వల్ల ఈ కొళాయిలు అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. 1వ వీధి నుండి 35వ వీధి వరకు కాలువలు లేవు. 1వ వీధి నుండి 15వ వీధి వరకు కొళాయిలకు కనెక్షన్ ఇవ్వకపోవడం వల్ల నీటికి ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రొద్దుటూరు పట్టణానికి సమీపంలోని ఈ గ్రామం దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటైంది. అప్పటి నుండి గృహాలు నిర్మించుకొని ఇక్కడి ప్రజలు నివాసముంటున్నారు. అయినా ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదు. కాలువలను నిర్మించకపోవడం వల్ల మురికినీరంతా ఆవాసాల మధ్యనే ఉండి దుర్గంధాన్ని వెదజల్లుతోంది. మురికినీరు అధికంగా చేరడంతో అక్కడక్కడా మురికినీటి చెరువుల్లా తయారయ్యాయి. దీంతో దోమల బెడద, పందుల, విషసర్పాల సంచారం ఎక్కుగా ఉందని స్థానికులు హడలిపోతున్నారు. చీకటి పడితే బయటికి వచ్చేందుకు స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు ఎక్కువగా అసౌకర్యానికి గురవుతున్నారు. ఇక్కడి సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామనీ, అయినా ప్రయోజనం లేదనీ స్థానికులు వాపోతున్నారు. ఇటీవల ముగిసిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే, సర్పంచు దృష్టికి కూడా సమస్యను తీసుళ్లామన్నారు. చేద్దాం.. చూద్దాం అన్నారేగానీ ఫలితంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరుకేమో ఇంటింటికి కుళాయిలు బిగించారు.. కనెక్షన్ ఇవ్వకపోవడం వల్ల డమ్మీలు బిగించేశారన్నారు. మూడు నాలుగు వీధులకు ఒక కొళాయి నీటి అవసరాలు తీరుస్తుండడం వల్ల ఏరోజుకారోజు నీరు లభించడం అదృష్టంగా భావించాల్సివస్తోందని స్థానికులు పేర్కొం టున్నారు. ఆ నీరు కూడా ఉదయం ఒక గంట, సాయంత్రం ఒకగంట వస్తుండడం వల్ల సమస్య తీవ్రంగా తయారైందని వాపోతున్నారు. తమ గ్రామంలో ఉన్న ప్రధాన సమస్యలను ప్రజాప్రతి నిధులు, అధికారులు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అసౌకర్యాల మధ్య బతుకుతున్నాం

మనిషికి కనీస అవసరాలైన నీరు, శుభ్రత వంటివి మా ప్రాంతంలో లేవు. దాదాపు 70కుటుంబాలకు ఒకే కుళాయి ఉండడంతో నీటికోసం యుద్ధమే చేయాల్సి వస్తోంది. అయినా అవసరాల మేరకు నీరు దొరకడం లేదు. చాలాసార్లు అధికారులకు చెప్పినా ప్రయోజనం లేదు.

- వెంకటలక్షుమ్మ, అమృతనగర్

దోమలబాధ భరించలేకున్నాం

ఇళ్ల చుట్టూ రోత ఎక్కువగా ఉంది. పందులు, దోమల సంచారం తీవ్రంగా ఉంది. రాత్రి వేళ దోమలతో నిద్ర కరువైంది. చిన్న పిల్లలతో చాలా ఇబ్బంది పడుతున్నాం. మా ప్రాం తంలో కాలువలు ఏర్పాటు చేయమని చాలాసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు దయచూపాలి.

- ఖాజాబీ, అమృతనగర్

ప్రతి హామీని నెరవేర్చిన సిఎం జగన్

ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - ఖాజీపేట

ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. మండలంలోని కొత్త పుల్లూరు, ఆంజనేయకొట్టాలు గ్రామాల్లో బుధవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్ రెడ్డి, ఎంపిపి అబూబకర్ సిద్దిక్, జడ్పీ కో-ఆప్షన్ మెంబర్ అచ్చుకట్ల కరీముల్లా, ఆంజనేయ కొట్టాలు సర్పంచు గోపి రెడ్డి పెద్దిరెడ్డి, ఎంపిటిసి మీసాల సుజనమ్మ పుల్లూరు ఉప సర్పంచు ఇరగంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపిపి భాస్కర్ ఒడ్డి , మండల పరిషత్ కో-ఆప్షన్ నెంబర్ మున్వర్ హుస్సేన్, మండల సచివాలయ కన్వీనర్ పి.గోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మైలవరం : ప్రతి గడపకూ ప్రభుత్వ పథకాలు చేరాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన మైలవరంలో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శివగురువిరెడ్డి, చరిత బిల్డర్స్ అధినేత చెన్నకేశవరెడ్డి, వైసిపి యువ నాయకులు వినయ్‌కుమార్‌రెడ్డి, రాఘవరెడ్డి, సుబ్బరాయుడు, జగదీశ్వర్‌రెడ్డి, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎంపీ అవినాష్‌రెడ్డి అరెస్టు తప్పదు : మాజీ ఎమ్మెల్సీ

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని, కాబట్టి మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎంపీ అవినాష్‌రెడ్డిని సిబిఐ అధికారులు అరెస్టు చేయడం తప్పదని పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవీంద్రారెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీ మంచితనం గురించి జిల్లా ప్రజలకు తెలియడానికి నువ్వేమీ పుచ్చలపల్లి సుందరయ్యవా లేక తరిమెళ నాగిరెడ్డివా అని బీటెక్ ప్రశ్నించారు. టిడిపి నాయకులపె నిందలు మోపి రాజకీయంగా జిల్లాలో మళ్ళీ తిరగాలని ఎంపీ అవినాష్‌రెడ్డి భావిస్తున్నారని అన్నారు. వివేకా కూతురు డాక్టర్ సునీతకు త్వరలో న్యాయం జరుగుతుందన్నారు. తన తండ్రి వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేసిన వారిపై న్యాయ పోరాటం చేస్తున్న డాక్టర్ సునీతలాంటి వ్యక్తులు పార్టీలోకి వస్తున్నారంటే ఎలాంటి అభ్యంతరాలు చెప్పాల్సిన అవసరం ఉండదన్నారు. రాజకీయ పార్టీలకు న్యాయ పోరాటం చేసే వ్యక్తులే కావాలన్నారు. ఇంత వరకు సునీతమ్మతో ఎలాంటి సంప్రదింపులు చేయలేదని, వారికి రాజకీయ ప్రవేశం చేయాల్సిన యోచన కూడా లేదని ఆయన వెల్లడించారు. విలేకరుల సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆర్‌వి రమేష్, శేషారెడ్డి, పాపిరెడ్డి, వీరభద్ర, డక్కా రమేష్, జబీవుల్లా, గణేష్ నాయక్, ఏమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, గోగుల మల్లికార్జున, మారుతి, పిపి చెంద్రాయుడు, పూల అల్లాభక్షు, ఈశ్వరయ్య, యుగంధర్, వేమ కుమార్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గోల్డెన్ ఫ్రూట్ సాగు.. బహుబాగు

బాక్స్‌ల్లో ఉంచిన గోల్డెన్ ఫ్రూట్స్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల నియోజకవర్గంలో ఎక్కువ శాతం రైతులు చీని, అరటి పంటలను సాగు చేస్తుంటారు. కానీ కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు పుష్పనాథ్ రెడ్డి కొత్తగా ఆలోచించారు. తనకున్న ఐదెకరాల్లో గోల్డెన్ ఫ్రూట్ అనే పంటను సాగు చేశారు. ఆయన తెలిపిన మేరకు వివరాలిలా.. విశాఖపట్నం లంబసింగి ప్రాంతంలో ఈ ఫ్రూట్ పంట సాగు చేయడాన్ని చూశానని, మన గ్రామంలో కూడా ఈ పంటను ఎందుకు పండించలేమని ఆలోచించానని వచ్చిందన్నారు. వెంటనే దీనికి సంబంధించిన విత్తనాలను గుజరాత్ నుంచి తెప్పించి సాగు చేశానని పేర్కొన్నారు. ఈ పంట సాగుకు రూ.3.60లక్షల ఖర్చు వచ్చిందన్నారు.. ఈ పంట గంగిరేణికాయ టైపులో కాపు వస్తుందని వివరించారు. కాయ తీపుతో కూడిన పులుపుగా ఉంటుందని అంటున్నారు. ముఖ్యంగా వీటిని తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మంచి చేస్తుందని తెలిపారు. అంతేకాకుండా హైదరాబాద్, బెంగళూరు వంటి చాలా ప్రదేశాల్లో ఈ ఫ్రూట్‌కు మార్కెట్లో చాలా డిమాండ్ ఉందని, ప్రస్తుతం వీటిని కిలో రూ.300 ఉంటుందని రైతు అంటున్నారు. అంతకు మునుపు కూడా మరో 5 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ పంటను కూడా సాగు చేశానని, ఇందులో కూడా మంచి లాభాలు కూడా వచ్చాయన్నారు. మొదట్లో తాను ఈ పంటను సాగు చేసేటప్పుడు చాలామంది రైతులు కొత్త పంటలు సాగు చేస్తున్న ఇబ్బంది పడతావు.. ఆలోచించి అడుగు వేయమని చెప్పారని తెలపారు. తాను మాత్రం వెనకడుగు వేయకుండా వేసిన డ్రాగన్ ఫ్రూట్‌లో మంచి లాభాలే ఆశించి, అలాగే మరో వినూత్న ఆలోచన చేసి గోల్డెన్ ఫ్రూట్ అనే పంటను సాగు చేశానని తెలిపారు. ఇందులో కూడా మంచి లాభాలు వస్తున్నాయని రైతు వివరించారు. తాను పండించిన పంట ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ పంటలు సాగు చేయడం వల్ల నష్టమైతే రాదు అంటున్నారు. ఒక కేజీ విత్తనాలు గుజరాత్ నుంచి అయితే దాదాపు రెండు లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని. కానీ తాము ఇక్కడ పంట పండించిన తర్వాత విత్తనాలు కూడా ఇక్కడే తీయడం జరుగుతుందని. అందువల్ల మేమే ఎవరైనా పంటసాగు చేయాలనుకునే వారికి లక్ష నుంచి లక్ష ఇరవై వేల లోపల విత్తనాలు కూడా ఇస్తామని రైతు తెలిపారు. ముఖ్యంగా ఈ పంట జూన్, జూలై మాసాల కల్లా పంట చేతికి వచ్చేలా వేసుకోవాలని తెలిపారు. వేసవికాలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.. కాబట్టి పంట సరిగా రాదని ఆయన అంటున్నారు. మొత్తానికి ఈ పంట ఒక ఎకరాకు 4 టన్నులు దిగుబడి వస్తుందని, ఒక్కో టన్ను విలువ రెండున్నర లక్ష రూపాయలు వస్తుందని ఆయన అన్నారు. ఇంకా విదేశాలకు ఎగుమతి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామని అక్కడికి విక్రయించేందుకు మార్గాలు సులువు అయితే మనం ఊహించని రీతిలో లాభాలు వస్తాయని తెలిపారు.

పంట బాగా వచ్చింది

గోల్డెన్ ఫ్రూట్ పంటను కొత్తపల్లిలో ఐదు ఎకరాలలో సాగు చేశాను. ఈ ఏడాది పంట బాగా వచ్చింది. కానీ ఈ పంట జూన్, జూలై నాటికి వచ్చే విధంగా సాగు చేయాలి. ఎండవేడికి పంట సరిగా రాదు. ఎవరైనా పంట వేయాలనుకుంటే తాము విత్తనాలు కూడా అమ్ముతాం. మామూలుగా అయితే మీకు విత్తనాలను గుజరాత్ నుంచి తెప్పించాలి. తాము కూడా అక్కడి నుంచి తీసుకు వచ్చి మొదటగా ఈ పంటను సాగు చేశాం. ఇక్కడే మేమే ఆ విత్తనాలు కూడా విక్రయిస్తాం.

- పుష్పనాథ్‌రెడ్డి, రైతు

సామాజిక తనిఖీపై అవగాహన

ప్రజాశక్తి - చాపాడు

మాట్లాడుతున్న ఎంఇఒ రవిశంకర్

పాఠశాలల సామాజిక తనిఖీ మీద ఉపాధ్యాయులకు బుధ వారం స్థానిక స్త్రీ శక్తిభవన్‌లో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ రవిశంకర్ మాట్లాడుతూ పాఠశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాలను పేరెంట్స్ కమిటీ సమక్షంలో పరిశీలించి యాప్‌లో సమాచారం పొందు పరచాలని సూచించారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న వసతులు అన్నిటిని నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. సోషల్ ఆడిట్‌కు సంబంధించి చేపట్టాల్సిన అంశాలపై రిసోర్స్ పర్సన్ వెంకటసుబ్బయ్య ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రాథమికోన్నత ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు, ఎంఆర్‌సిలు, సిబ్బంది పాల్గొన్నారు.

'సీమ' పోలీస్ కంప్లైంట్ అథారిటీ మెంబర్‌గా 'కాకర్ల'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాయలసీమ పోలీసు కంప్లైంట్ ఆథారిటీ మెంబర్‌గా కాకర్ల నాగశేషారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తనకు ఈ పదవి వచ్చేందుకు అన్ని విధాలా సహాయ సహకారాలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డికి, వైసిపి అగ్రనేతలకు కాకర్ల నాగశేషారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పదవి రావడంపట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ పార్టీ నేతలతో కలిసి బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు నివాసం వద్ద ప్రత్యేకంగా కలిసి పుష్ప గుచ్ఛాలను అందజేసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఎంపిపి శేఖర్ యాదవ్, జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ కల్లూరు నాగేంద్రరెడ్డి, మాజీ కౌన్సిలర్ సౌరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలుపుతున్న కాకర్ల నాగశేషారెడ్డి

ప్రజల్లో నిరుత్సాహం : టిడిపి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం పట్ల ప్రజలు నిరుత్సాహంగా ఉన్నారని టిడిపి జమ్మలమడుగు ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కన్నెలూరులో బుధవారం ఆయన ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివ రించారు. అనంతరం భూపేష్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ఈ ప్రభు త్వంలో ప్రజలు పడుతున్న సమస్యలను తెలుసుకున్నామన్నారు. కార్యక్రమంలో కన్నెలూరు టిడిపి నాయకులు నవనీష్‌రెడ్డి, దేవగుడి యూత్ నాగేశ్వర్‌రెడ్డి, నరేంద్ర నాథ్‌రెడ్డి, జింకా కుళ్లాయప్ప, జింకా నరేంద్ర, శివారెడ్డి, చింతల మునిస్వామి, బెల్లంకొండు బాషా, కొండయ్య, దాడిశెట్టి శ్రీను, ప్రశాంత్, యోహాను, జగ్గయ్య,రుషి, కిషోర్, సురేష్, చంటి, జింకల బాషా, రాజేష్, సుబ్బన్న, ఓబులేసు, పురుషోత్తం, పీటర్, ఓబులేసు, చిన్నిరెడ్డి, చిన్నోడు, దేవరాజు, రాష్ట్ర కార్యదర్శి జాంబపురం రమణారెడ్డి పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

డిఎస్‌పి నాగరాజు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగులో మూడేళ్లుగా డిఎస్‌పి నాగరాజు చేసిన సేవలు మరువలేనివని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివనారాయణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సభ్యులు వినయ్ తెలిపారు. డిఎస్‌పి బదిలీ అయిన సందర్భంగా బుధవారం వారు ఆయనను సన్మా నించారు. కార్యక్రమంలోఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆదా ము, ప్రసాద్‌రెడ్డి, డివైఎఫ్ఐ జమ్మలమడుగు ఉపాధ్యక్షులు ప్రసాద్ పాల్గొన్నారు.



డిఎస్‌పి నాగరాజును సన్మానిస్తున్న నాయకులు

పల్లవోలు వద్ద వరిధాన్యాన్ని వర్షానికి తడవకుండా పట్టలు కప్పిన రైతులు

అకాల వర్షం.. రైతులకు ఇక్కట్లు

ప్రజాశక్తి - చాపాడు

భానుడి తీవ్రతకు ప్రతి ఒక్కరూ ఇబ్బందులు పడుతుంటే బుధవారం ఉదయం అనుకోకుండా మబ్బులు కమ్ముకొని పడిన వర్షానికి మండల వ్యాప్తంగా వివిధ రకాల పంటలు నూర్పిడి చేసే రైతులు ఇబ్బం దులు పడ్డారు. వాతవరణంలో క్షణాల్లో మార్పుల కారణంగా మండల పరిధిలో వర్షం పడింది. వేసవి సీజన్‌లో సాగైన వరి, నూగు పంట ప్రస్తుతం నూర్పిడి దశలో ఉంది. రైతులు వరి పంట నూర్పిడి చేసి వరి ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. అలాగే పసుపు పంటను ఉడికించి ఆరబెట్టారు. వర్షం ఒక్కసారిగా పడడంతో ధాన్యాన్ని, పసుపును కాపాడుకునేందుకు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. వేసవి సీజన్‌లో సాగైన వరి పంట ప్రస్తుతం నూర్పిడి పనులు ప్రారంభించారు. వర్షంలో నూర్పిడి చేసిన వరి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు. వరి ధాన్యాన్ని రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో ఆరబోతకు ఉంచారు. వర్షం పడగానే ప్లాస్టిక్ పట్టాలను వేసి వరి ధాన్యాన్ని కప్పి కాపాడుకునే ప్రయత్నం చేశారు. మండల పరిధిలోని సిద్దారెడ్డి పల్లె, సోమాపురం, బద్రిపల్లె, చాపాడు, పల్లవోలు గ్రామాల పరిధిలో వరి పంట, కేతవరం, బద్రిపల్లె, సీతారామపురం వద్ద పసుపు పంటను కాపాడుకునే ప్రయత్నం చేశారు.

మరిన్ని పతకాలు సాధించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

వెయిట్ లిఫ్టింగ్ పోటీలో గొడ్లడీటి రవికుమార్ మరిన్ని పథకాలు సాధించాలని టిడిపి నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఆకాక్షించారు. రవికుమార్ గతనెలలో చండీగఢ్‌లో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించిన సందర్భంగా బుధవారం నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఘనంగా సన్మానించారు. జాతీయ స్థాయిలో పోటీల్లో తృతీయ బహుమతి సాధించేందుకు కృషిచేసిన స్పోర్ట్స్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ షేక్ భాషా మొహిద్దిన్, కోచ్‌లు శివశంకర్ రెడ్డి గోపీనాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, టిఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షులు అనిల్ కుమార్, టిఎన్ఎస్ఎఫ్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ తిత్తిల విశ్వనాథ్, టిడిపి ఎస్సీ సెల్ నగర కార్యదర్శి బిల్లా నవీన్ పాల్గొన్నారు.

రవికుమార్‌ను సన్మానిస్తున్న రెడ్యం